ఎన్నికలకు సిద్ధం

నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, సామినేని ఉదయభాను

కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజక వర్గాలకు, 24 పార్లమెంట్ నియోజకవర్గాలకు తమ పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థుల పేర్లను ఇడుపులపాయలో వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులుగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు మొండితోక జగన్‌మోహనరావు, సామినేని ఉదయభాను పేర్లను ప్రకటించారు.

నాలుగున్నర దశాబ్దాలుగా ప్రజాసేవలోనే...



జగ్గయ్యపేట: వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేరు ప్రకటించారు. ఆయన వయసు 68 ఏళ్లు. విద్యార్హత బీకాం. ఆయన తండ్రి సామినేని విశ్వనాథం జగ్గయ్యపేట పంచాయతీ సర్పంచ్‌గా చేశారు. ఉదయభాను భార్య విమల. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ పట్టణంలోని 8వవార్డు కౌన్సిలర్.

రాజకీయ నేపథ్యమిది
1975 నుంచి 77 వరకు ఎస్‌జీఎస్ ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాల విద్యార్థి సంఘ అధ్యక్షునిగా ఎన్నికై నాయకునిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1981 లో కృష్ణా జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులై అదే ఏడాది పేట నగర పంచాయతీ వార్డు సభ్యునిగా ఎన్నికయ్యారు. 1987–1992 మధ్య పేట గోపాలకృష్ణ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షునిగా, 1992లో కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా సేవలందించారు. 1991 నుంచి నేటి వరకు పేట ఏరియా ఐఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. 1989 నుంచి 96 వరకు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా, 1997 లో పీసీసీ సభ్యునిగా, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షునిగా, 1998 లో పీసీసీ కార్యదర్శిగా నియమితులయ్యారు.1999, 2004, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. 2009, 2014 ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందారు.

సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు
సామినేని ఉదయభాను నియోజకవర్గంలో పలు సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉచిత కంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం, దేవాలయాలు, చర్చిల నిర్మాణాలకు తన వంతు ఆర్థిక సహకారం అందించడం, నిరుపేదలకు ఉచిత అన్నదాన కేంద్రం ఏర్పాటు చేశారు.

ఇతర వివరాలు
తన సతీమణి విమలభాను పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచిత బస్సుపాస్‌లు, వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్నారు.

నవ్య నందిగామ నిర్మాణానికి అవిరళ కృషి



నందిగామ: వైఎస్సార్ సీపీ నందిగామ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేరు ప్రకటించారు. ఆయన వయసు 59 ఏళ్లు. ఆయన తల్లిదండ్రులు మొండితోక కృష్ణ, కస్తాల మరియమ్మ. ఎంబీబీఎస్, ఎండి చదివిన జగన్‌మోహనరావు నందిగామలో శ్వాసకోశ వ్యాధి నిపుణుడుగా వైద్యసేవలు అందిస్తున్నారు. ఆయన సతీమణి డాక్టర్ పెద్దాడ రమాదేవి (ఎంబీబీఎస్, డీజీవో) గైనకాలజిస్టు. ఇద్దరు కుమారులు శివసాయికృష్ణ, కృష్ణ సమీర్.

రాజకీయ నేపథ్యం
మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో చేపట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై 2013లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్థాపించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నందిగామ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి తంగిరాల ప్రభాకరరావుపై 5,074 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఓటమి తర్వాత నందిగామ పట్టణంలో ఆసుపత్రి ఏర్పాటు చేసి సేవలందించడంతో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉన్నారు. 2019 ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్యపై 10,881 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు
నియోజకవర్గంలో రెవెన్యూ డివిజన్, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు. సీఎం రోడ్డు విస్తరణ, అభివృద్ధి, చందర్లపాడు, రామన్నపేట రోడ్డు విస్తరణ, కంచికచర్ల– పెద్దాపురం రహదారి విస్తరణ, అభివృద్ధి. సీఎస్ఆర్ నిధులతో గాంధీ సెంటర్ సుందరీకరణ, లిమ్కా బుక్, తదితర రికార్డులు కలిగిన నట్, బోల్ట్ గాంధీ విగ్రహం ఏర్పాటు. నందిగామలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు.100 పడకల ఆస్పత్రి మంజూరుకు కృషి. కంచికచర్లలో మహిళా డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి. వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు. వీరులపాడు మండల కేంద్రంగా జుజ్జూరు ఏర్పాటు.

ఇతర వివరాలు
తన తల్లి కస్తాల మరియమ్మ సేవా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల రూ.50 లక్షల నిధులతో కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నెలరోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇప్పించారు. వివిధ వర్గాల వారికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు.

ఇళ్లు కాదు..ఊళ్లు నిర్మిస్తున్నాం

ప్రభుత్వవిప్ ఉదయభాను

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఇళ్లు కాదు ఏకంగా ఊళ్లే నిర్మిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలో శనివారం జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన 72 ఇళ్ల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా యూపీ స్కూల్‌లో రూ.10.82 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, సర్పంచ్ జక్కులూరి రాంబాబు, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ అధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, నూకవరపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు బేరుతుల నాగమణి, పార్టీ జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి జి.వడ్డీకాసులు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ మల్లెంపాటి జయరామ్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, ఆలయ డైరెక్టర్లు బెజవాడ శ్రీనివాసరావు, నంబూరి రవి తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో...
మండలంలోని నవాబుపేట నుంచి నందిగామ మండలం బెల్లంకొండవారి పాలెం వరకు రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శనివారం విప్ ఉదయభాను శంకుస్థాపన చేశారు. నవాబుపేట నుంచి జయంతిపురం వరకు రూ.6 కోట్లతో రోడ్డు నిర్మించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్రెముచ్చు మేరీ, ఎంపీటీసీ సభ్యులు మాతంగి శాంతకుమారి, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి రవికుమార్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గింజుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఉదయభాను, నెడ్‌క్యాప్ చైర్మన్ రవికుమార్, ఎంపీపీ గాంధీ

తొర్రగుంటపాలెంలో 165 మందికి ఇళ్ల స్థలాలు
స్థానిక 8 వ వార్డు, తొర్రగుంటపాలెంలో శనివారం 165 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ తొర్రగుంటపాలెంలో ఒక్కొక్కరికి రూ.5 లక్షల విలువైన స్థలం 165 మందికి పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ స్థలం తమదే అంటూ కొందరు వ్యక్తులతో దొంగ పట్టాలను తయారు చేసి టీడీపీ వారు హైకోర్టులో కేసులు వేయించి పంపిణీ నిలిపివేయాలని స్టే తీసుకువచ్చారని తెలిపారు. ఇది దొంగ పట్టా అని తాము విచారించి కోర్టులో నిరూపించామన్నారు. ఇందుకు గాను వార్డు కౌన్సిలర్‌గా ఉన్న సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ కోర్టులు, అధికారుల చుట్టూ తిరిగి ఇప్పటికి ఈ స్థలాల కోసం రూ.15 లక్షల వరకు ఖర్చు చేశాడని, చివరికి స్థలాలు సాధించామన్నారు.

టీటీడీ కల్యాణ మండపం ప్రారంభం
స్థానిక చిల్లకల్లు రోడ్‌లో రూ.3.50 కోట్లతో చేపట్టిన టీటీడీ కల్యాణ మండపాన్ని శనివారం ఉదయం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు వివాహాలు తదితర శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ఈ మండపం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రూ.2.50 కోట్లతో రెండంతస్తుల కల్యాణ మండప భవనం, రూ.కోటి తో డైనింగ్ హాల్, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కౌన్సిలర్ కాశి అనురాధ, కిషోర్ దంపతులు పీటలపై కూర్చుని రాముల వారి కల్యాణోత్సవం, పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర లిడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలే స్టార్ క్యాంపెయినర్‌లు

నందిగామటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు, మహిళలే స్టార్ క్యాంపెయినర్‌లు అని ప్రతిపక్ష పార్టీల మాదిరిగా సినిమా స్టార్‌లు, క్యాంపెయినర్‌లు లేరని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులతో శుక్రవారం రాత్రి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయంలో మహిళలు కీలక భూమిక పోషించాలన్నారు. టీడీపీ చేసిన అన్యాయాలు, మోసాలతో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని ప్రజలకు వివరించి రానున్న ఎన్నికలలో పార్టీ విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి
వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లటంతో పాటు రానున్న ఎన్నికలలో పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. మండలంలోని అల్లూరు, జుజ్జూరు, జయంతి గ్రామాలలో ప్రజాప్రతినిధులు, బూత్ కన్వీనర్‌లు, బూత్ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌లు షహనాజ్ బేగం, బొమ్మిశెట్టి భాస్కరరావు, సర్పంచ్ రమావత్ రాము, బందెల రాణి, వైస్ ఎంపీపీలు వేమూరి ఆదాం, షేక్ నాగుల్‌మీరా, నాయకులు పసుపులేటి సాయిబాబు, ఇప్పల కృష్ణారెడ్డి, పూలా రాంబాబు, ఇప్పల సత్యనారాయణ రెడ్డి, మోండ్రు బాయమ్మ, శీలం రమణారెడ్డి, జంగా కోటిరెడ్డి పాల్గొన్నారు.



మహిళా ప్రజా ప్రతినిధులు, నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

సాంకేతిక ఆవిష్కరణలపై అవగాహన అవసరం

కంచికచర్ల: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు నూతన సాంకేతిక ఆవిష్కరణలపై పూర్తి అవగాహన కలిగి ఉంటేనే మెరుగైన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశం ఉందని మిక్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ అన్నారు. కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో శనివారం జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియమ్ 'ఆగమ 2024' నిర్వహించారు. ముందుగా పేపర్ ప్రజెంటేషన్, క్విజ్, కోడింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు ఎం.సుహాస్, ఆగమ కో ఆర్డినేటర్లు డాక్టర్ పి.ప్రదీప్, ఎ.అనురాధ, పలు విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామలో పోలీసుల ప్రత్యేక తనిఖీలు

నందిగామ: ఎన్నికల నేపథ్యంలో నిత్యం ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని సీఐ హనీష్ తెలిపారు. పట్టణంలో శనివారం పలుచోట్ల వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని ప్రతి లాడ్జ్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. లాడ్జిలలో ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతిరోజు వాహన తనిఖీలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. లాడ్జిలకు వచ్చే వారిపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ పండు దొరతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మేలు జరిగిందంటేనే ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు
- కంచికచర్లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందంటేనే తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలంతా ఆశీర్వదించాలని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్లలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు, నాయకులు అమర్లపూడి యోహాన్, దేవరకొండ గురవయ్య, వేల్పుల శ్రీనివాసరావు, దాసరి రాంబాబు, నారిశెట్టి శ్రీనివాసరావు, ఎం.పాండు, తంగిరాల సృజన్ కుమార్, వీఆర్వో శేషం సురేష్‌బాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



కంచికచర్లలో సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

గ్రామాల అభివృద్ధికి కృషి

పెండ్యాల(కంచికచర్ల) : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పెండ్యాలలో రూ.18 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణపనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇప్పటికే నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందన్నారు. ఒక పక్క సంక్షేమం, మరో పక్క అభివృద్ధి పనులు చేపడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలంతా మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్ బడే హజరత్, సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, నాయకులు షేక్ పీర్‌సామియా, షేక్ నిస్సార్‌పాషా, షేక్ చాన్‌బహుదూర్, మార్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పెండ్యాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కబడ్డీ పోటీల్లో అమ్రితసాయి విద్యార్థుల ప్రతిభ

పరిటాల(కంచికచర్ల): తమ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య నందించటంతో పాటు క్రీడల్లో మంచి తర్ఫీదు ఇస్తున్నామని కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు అన్నారు. ఇటీవల అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగిన జాతీయ స్పోర్ట్స్ ఫెస్ట్ కబడ్డీ పోటీల్లో పరిటాల అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మొదటి బహుమతి సాధించారు. శనివారం కళాశాలలో వారిని అభినందించారు. కేఎల్ యూనివర్సిటీలో జరిగిన కబడ్డీ పోటీలో తమ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారని తెలిపారు. విట్ యూనివర్సిటీ నిర్వహించిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో బ్యాడ్మింటన్ పోటీల్లో 32 జట్లు తలపడగా తమ కళాశాల విద్యార్థులు రన్నర్‌గా నిలిచి ద్వితీయ బహుమతి, ప్రశంసా పత్రం అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్లు పి.శ్రీనివాసరావు, పి.శివ రామకృష్ణ, హెచ్ఓడీ డి.పవన్‌కుమార్ అభినందించిన వారిలో ఉన్నారు.



జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో విజేతలతో కరస్పాండెంట్ రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ శశిధర్

ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలి

నందిగామ: ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని నందిగామ ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.రవీంద్రరావు సూచించారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 6 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 4 ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) టీమ్‌లతో పాటు ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తున్నాయన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించినట్లు తెలిపారు.

పెనుగంచిప్రోలు: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని తహసీల్దార్ వి.అమ్మాజి అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, ఎంఎస్‌కే లతో సమావేశం నిర్వహించారు.

మల్కాపురం, గండ్రాయి గ్రామాల్లో పోలీస్ కవాతు

జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం మండలంలోని మల్కాపురం, గండ్రాయి గ్రామాలలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లకల్లు ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు, ప్రత్యేక బలగాలు గ్రామాలలోని ప్రధాన వీధుల్లో కవాతు చేసి శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కలిగించారు.

851 మందికి వైద్య సేవలు

నందిగామ(చందర్లపాడు): విజయవాడకు చెందిన లైఫ్ చేంజింగ్ సెంటర్, పీజే స్టీఫెన్ పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చందర్లపాడులో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 851 మందికి వైద్య సేవలందించారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు అన్ని విధాలుగా సంక్షేమ ఫలాలు అందజేస్తూ వారి అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు సహకారంతో 60 మంది టైలర్లకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర , సామినేని వెంకటకృష్ణప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన త్యాగం మరువలేనిదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ నేత సామినేని వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి వెంకట కృష్ణ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం వాణిజ్య విభాగం చైర్మన్ కొత్తా పురుషోత్తం, పార్టీ వాణిజ్య విభాగం పట్టణ అధ్యక్షుడు చారుగుండ్ల కొండ, శివాలయం చైర్మన్ అంగడాల పూర్ణ, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బద్దూనాయక్, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, నాయకులు కాశి కిషోర్, దువ్వల రామకృష్ణ, వల్లాల విస్సు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములకు నివాళులర్పిస్తున్న జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు రాజారావు తదితరులు

వత్సవాయిలో...
వత్సవాయి : పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వత్సవాయిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు వెంకట రాజారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాలను వివరించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పాలు, రొట్టెలను అందజేశారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా మాజీ అధ్యక్షుడు తుమ్మేపల్లి నరేంద్ర, గుర్రం మోహన్ రావు, హనుమంతురావు, దుగ్గి ఉమామహేశ్వర రావు, చిరునోముల రమేష్, గుర్రం రమేష్, యర్రా శ్రీనివాస్, జల్లా గురునాథం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



వత్సవాయి: గ్రామంలో జనసేనకు చెందిన నాయకులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సమక్షంలో గ్రామానికి చెందిన పసుపులేటి సీతారామయ్య, మేడి మెగ్గేశ్వరరావు, సిద్దంశెట్టి రమణ ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలో చేరారు. చేరిన కొద్ది రోజులకే అక్కడ పరిస్థితులు నచ్చక మరలా సొంతగూటికి చేరారు. వీరికి ఉదయభాను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

మూడు లక్షలు ఆర్థిక సాయం

వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయి సహకార పరపతి సంఘంలో బకాయి ఉన్న ముగ్గురు సభ్యులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. చనిపోయిన సభ్యుల కుటుంబ సభ్యులకు కేడీసీసీ బ్యాంకు, ఎల్ఐసీ వారు సంయుక్తంగా ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయాన్ని అందించారు. సొసైటీ ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మేనేజర్ కమలాకర్, సొసైటీ సీఈవో సామినేని హరికృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి ప్రారంభించారు. గ్రామంలో రూ.32 లక్షలతో నిర్మించిన రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, రూ.32 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా జెడ్పీ పాఠశాలలో రూ.95 లక్షలు, ప్రాథమిక పాఠశాలలో రూ.5లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు, ఇతర సౌకర్యాలను ప్రారంభించారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వీరులపాడు: పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో పాల్ కెనడి తెలిపారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని జమ్మవరం, వీరులపాడు, అల్లూరు, జయంతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 684 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తొమ్మిది గంటల కల్లా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు.

వలస కూలీకి పాముకాటు

శివాపురం(పెనుగంచిప్రోలు): వలస కూలీ పాముకాటుకు గురైన సంఘటన మండలంలోని శివాపురం గ్రామంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ఆదిలాబాద్‌కు చెందిన 13 సంవత్సరాల సాగర్ అనేబాలుడు గ్రామంలో మిర్చి కోతలకు కుటుంబసభ్యులతో వచ్చాడు. పనులు చేస్తున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. వెంటనే పెనుగంచిప్రోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో విజయవాడ తరలించారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన గొప్పనాయకుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. మాజీ గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు, పాఠకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 175 కేసులు పరిష్కారం

నందిగామ: లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులు కేసులను సత్వరం పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందని పట్టణంలోని జిల్లా 16 వ అదనపు కోర్ట్ న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కోర్టుల ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. అనంతరం మూడు బెంచ్‌లు ఏర్పాటు చేసి న్యాయమూర్తులు వి.శ్రీనివాసరావు, వి.రాజ్యలక్ష్మి , ఎస్.కె రియాజ్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్ ద్వారా మొత్తం 175 కేసులు పరిష్కారం కాగా ఆయా కేసుల ద్వారా రూ.3,11,10,350 నష్టపరిహారాన్ని అందజేశారు.

జగ్గయ్యపేటలో...
జగ్గయ్యపేటఅర్బన్: జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం స్థానిక కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి పాల్గొన్నారు. లోక్ అదాలత్‌లో 127 కేసులు పరిష్కారం అయ్యాయి.

కోర్టు ఆవరణలో వైద్య శిబిరం
లోక్ అదాలత్ సందర్భంగా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు కె.శ్రావణి, ఎం.శోభారాణి ప్రారంభించారు. 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. స్మైలీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు కృష్ణ చైతన్యరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఈసీజీ పరీక్షలు చేశారు.